సాక్షి
చిత్తూరు
శనివారం । 15 । మార్చి । 2025



పచ్చ'ప్రళయం'

డ్రైవర్స్ కాలనీలో పచ్చప్రళయం కొనసాగుతోంది. సర్కారు అండతో తెలుగు తమ్ముళ్లు గూండా గిరి చేస్తున్నారు. - 8లో



ఒంటరి ఏనుగు బీభత్సం

గుడిపాల మండలంలో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. పంటలను ధ్వంసం చేసింది. - 8లో



గణేశా అని సంబోధించాలి

వరసిద్ధుడి ఆలయంలో అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్, సెట్‌లో తొలుత గణేశా అని సంబోధించాలని ఈఓ తెలిపారు. - 8లో



న్యూస్‌రీల్

నేటి నుంచే ఒంటిపూట బడులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు శనివారం నుంచి ఒంటి పూట బడులను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు పూర్తి రోజు పాఠశాలలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలన్నారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో పాఠశాలల్లో తాగునీటి వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ప్రతి పాఠశాలలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని డీవైఈఓ, ఎంఈఓలు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు.

సెలవులో కలెక్టర్

– ఇన్‌చార్జి కలెక్టర్‌గా విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: వ్యక్తిగత పనుల నిమిత్తం కలెక్టర్ సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి కలెక్టర్‌గా విద్యాధరి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సెలవు పెట్టారు. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్ విద్యాధరి కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

మామూళ్లు ఇవ్వలేదని..

హైవే మట్టి తరలింపునకు బ్రేకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు –తచ్చూరు హైవే రోడ్డుకు మట్టి తరలిస్తుంటే కూటమినేతలు అడ్డుపడ్డారు. ఇస్తే మామూళ్లు ఇవ్వండి.. లేదంటే ఆపేయండి అంటూ కూటమి నేతలు మట్టి తరలింపును పట్టుబట్టి ఆపేశారు. ఈ రోడ్డుకు చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ పంచాయతీ వరదరాజులపల్లి సమీపంలోని గుట్టలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిని పసిగట్టిన కూటమినేతలిద్దరు కొండెక్కి కూర్చుకున్నారు. ఐదుగురితో కలిసి బుధవారం రాత్రి హైవేకు మట్టి తరలిస్తున్న వ్యక్తితో బేరసాలు చేయాలని చూశారు. ఆ బేరం తెగకపోవడంతో రోడ్డు పాడవుతోందని సాకు చూపి ఊళ్లో పంచాయితీ పెట్టించారు. ఆ పెద్దమనుషులు వీరి ఆగడాలు తెలిసి అది రెవెన్యూ అధికారులు చూసుకుంటారు..మాకు సంబంధం లేదని చేతులెత్తేశారు. చేసేదీ లేక మండల నాయకుల సాయం తీసుకుని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచారు. పట్టుబట్టి మట్టి తరలింపును ఆపేశారు. దీంతో హైవేకు మట్టితరలిస్తున్న నిర్వాహకులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

మేలుకొందాం

తక్కువ తూకం..నాణ్యత లోపం..గడువుకు ముందే దెబ్బతినడం..నిర్లక్ష్యసమాధానం..బాధ్యతారాహిత్యం.. నిత్యావసర వస్తువుల మొదలు అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల వరకు ముందు..వెనుక దగా.. చివరకు నష్టపోయేది వినియోగదారుడే. ఈ లోపాలపై ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు వ్యాపారులు. ఇలాంటి సందర్భాల్లో చట్టం ఏమీ చేయాలో తెలియని కొనుగోలుదారుడికి రక్షణగా చట్టం ఉంది. దాని ద్వారా ప్రశ్నించే హక్కు ఉంది. మనం చేయాల్సింది వినియోగించుకుని మేలుకోవడమే. నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



- క్రయ.. విక్రయాల్లో ప్రజలు అయోమయం
- తూకాల్లో మోసాలు
- జోరుగా కల్తీలు
- మోసాలు, కల్తీలపై ప్రజలకు అవగాహన లేమి
- మేల్కోవాలంటున్న అధికారులు

కాణిపాకం/చిత్తూరు కార్పొరేషన్: క్రయ విక్రయాల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా అవేమీ మోసాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. కల్తీ విక్రయాలు ఆగడం లేదు. ఈ తరుణంలో ఏం చేయాలి.. ఎవరికి ఫిర్యాదు చేయాలన్న విషయం నేటికీ చాలా మందిలో అవగాహన లేదు. ఈ తరుణంలో వినియోగదారులు మేలుకోవాలని పలు శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు. కొనే ముందు పలు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. మార్కెట్‌లో మోసాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.

చల్లగా దోచేస్తున్నారు

అసలే వేసవికాలం.. మంచినీటి ప్యాకెట్లు, ఐస్‌క్రీమ్‌లు, శీతల పానీయాలకు గిరాకీ ఎక్కువ. ఇదే అదనుగా కొంతమంది అక్రమార్కులు.. సరైన ముద్రలు, బిల్లులు లేకుండానే నాసిరకం సరుకును మార్కెట్లోకి వదిలేస్తున్నారు. తయారీ తేదీ లేకుండానే లక్షల కొద్దీ నీళ్ల ప్యాకెట్లను విక్రయించేస్తున్నారు. వీటిపై అధికారులు 31 కేసులు నమోదు చేసి, రూ.75,500 అపరాధం విధించారు.



చిత్తూరులో ఓ బియ్యం దుకాణంలో 26 కిలోలకు బదులు 25 కేజీలు ఉన్న బస్తా





తప్పుల తక్కెడ

వే బ్రిడ్జిలపై గత ఆర్థిక సంవత్సరంలో 17 కేసులు నమోదయ్యాయి. హోల్‌సేల్ డీలర్లపై 5, రిటైల్ డీలర్లపై 79 కేసులను నమోదు చేశారు. చౌక దుకాణాల్లో మోసాలపై 16 కేసులు నమోదయ్యాయి. డీలర్లు తూకంలో డబ్బాలు పెట్టి మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. బియ్యం మిల్లులపై 37, ఎరువుల దుకాణాలపై 25 కేసులు నమోదుయ్యాయి.

మార్పు దిశగా..

- సినిమా థియేటర్లల్లో అధిక ధరలను నియంత్రించే దిశగా 629 జీఎస్‌ఆర్ ఉత్తర్వులు అమల్లోకొచ్చాయి. దీని ప్రకారం వస్తువులపై ధరలు పెంచి ముద్రించకూడదు..అధిక ధరలకు విక్రయించకూడదు. ఒకే కంపెనీ ఉత్పత్తిని వేర్వేరు చోట్ల రెండు రకాల ధరలతో విక్రయించకూడదు. అయితే కొన్నిచోట్ల ప్రీమియం ప్రోడక్టుల పేరుతో పానీయాలు, ఇతర సరుకులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లూజు అమ్మకాలపై నియంత్రణ లేకపోవటంతో తినుబండారాలు, శీతల పానీయాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. థియేటర్లలో అధిక ధరలపై 22 కేసులు నమోదు కాగా, రూ.1,32,500 అపరాధం వసూలు చేశారు.
- పెట్రోలు బంకుల్లో మోసాల నుంచి గట్టెక్కేందుకు కంపెనీలు ఐరన్ కేసింగ్ సీజ్ చేసిన పల్సర్ యూనిట్లను వాడుతున్నాయి. దీన్ని మార్చాలని విడదీస్తే మళ్లీ కొత్త పరికరాన్ని వేసుకోవాల్సిందే. అయినా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రకం మోసాలపై అధికారులు 36 కేసులు నమోదు చేసి, రూ.3 లక్షలు అపరాధం విధించారు.
- బంగారం తూకాల్లో మోసాలను నియంత్రించేందుకు ఎక్స్‌ఆర్‌ఎఫ్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. సాంకేతికతతో కూడిన మైక్రోస్కోప్ ఫోకస్ ఎక్స్రే ఫ్లోరోసెన్స్ యంత్రం ఆధారంగా ఆభరణం స్వచ్ఛతతోపాటు అందులో కలిసిన ఇతర లోహాల స్థాయి, అమర్చిన రాళ్ల బరువునూ లెక్కలతో సహా చెప్పి బిల్లు ఇస్తుంది. త్వరలో నగరానికి ఈ యంత్రం రానుంది.
- తూనికలు–కొలతల శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. ముద్రలు వేశాక ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు (వీసీ), ప్యాకింగ్ లైసెన్సులు, కాటాల తయారీ లైసెన్సులు, మరమ్మతుల డీలర్ల లైసెన్సుల ప్రక్రియలన్నీ ఆన్‌లైన్‌లోనే.

ఇంధనం

- పెట్రోల్, డీజిల్ నింపడానికి ముందు మీటర్ రీడింగ్ 0లో ఉందో లేదో చూడాలి.
- బంకు సిబ్బంది మాటల్లో పెట్టి దృష్టి మరల్చి రీడింగ్ జంప్ చేయడానికి ప్రయత్నిస్తే అడ్డుకోవాలి.
- అనుమానం వస్తే బంకులోని ముద్రతతో ఉన్న ఐదు లీటర్ల పరిమాణం గల కొలత పాత్ర ద్వారా సరిచూసుకోవచ్చు.
- కొనుగోలు చేసిన పెట్రోలు/డీజిలు సరైన ధర చెల్లిస్తున్నారో? లేదో గమనించి బిల్లు తీసుకోవాలి.
- ఇంధనం నాణ్యత మీద అనుమానం ఉంటే బంకు దగ్గరున్న ఫిల్టర్ పేపర్ తీసుకుని ఒక చుక్క పెట్రోలు దానిపై వేయాలి. రెండు నిమిషాల్లో ఎలాంటి మరక లేకుండా ఆవిరైతే నాణ్యత ఉందని అర్థం.

- తూనికలు కొలతల చట్టం నిబంధనలు రూల్ 10 షెడ్యూలు 1 టేబుల్ 2 ప్రకారం ఎరువులు, విత్త నాలు, సిమెంటు, బియ్యం వినియోగదారుల సమక్షంలోనే తూకం వేసి, ప్యాకేజీపై ముద్రించిన నికర బరువు ఉందో లేదో సరిచూసి డెలివరీ ఇవ్వాలి.
- వ్యాపారుల దగ్గర తప్పనిసరిగా ప్యాకేజీలను తూకం వేసే పరికరం ఉండాలి.
- వ్యాపారులు ఉపయోగిస్తున్న తూనిక పరికరం తూనికలు కొలతల శాఖకు చూపించి ముద్రలు వేయించుకుని ధ్రువీకరణ పత్రం పొందాలి. దీన్ని పరికరం దగ్గరే స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.
- వ్యాపార స్థలంలో ఉన్న ప్యాకేజీలపై లీగల్ మెట్రాలజీ చట్టం, నిబంధనల ప్రకారం అన్ని అంశాలు తప్పనిసరిగా ముద్రించి ఉండాలి.

గ్యాస్ బండారం

గ్యాస్ సిలిండర్లపై ముద్రితమైన బరువు తప్ప.. వాస్తవంగా ఎంత ఉందో అంచనా ఉండదు. వినియోగదారుడి ఎదుట బరువు తూ.చ. తప్పక అందించాలన్న నిబంధన అమలు కావడంలేదు. ప్లాంట్ల స్థాయి నుంచే మోసాలుంటున్నాయి. ఎల్పీజీ సిలిండర్లలో మోసాలపై గతేడాది 10 కేసులు నమోదుకాగా రూ.1.93 లక్షల అపరాధ రుసుమును వసూలైంది.

వ్యాపారం	కేసులు	అపరాధ రుసుం (రూపాయిల్లో)
పెట్రోల్, ఎల్‌పీజీ	10	1,93,000
బంగారు దుకాణాలు	2	3,00,000
ఐరన్, స్టీల్	13	88,500
హార్డ్‌వేర్	109	4,29,000
రైతుబజార్	18	15,000
మాంసం దుకాణాలు	36	39,000
ఎలక్ట్రానిక్స్	15	57,000
టెక్స్‌టైల్స్	5	1,49,000
రేషన్‌షాపులు	16	42,500
ఆయిల్ దుకాణాలు	8	64,500
స్వీట్స్	24	1,34,000
రైస్‌మిల్లు, దుకాణాలు	37	3,00,000
వెయింగ్ బ్రిడ్జిలు	17	5,93,000
డిస్పెన్సింగ్‌పంపులు	6	2,39,000
ఈ–కామర్స్	6	4,60,000

తూనికల కొలతలపై ఫిర్యాదులకు..

చిత్తూరు డివిజన్ – 78938 13707
చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలు, నగరి, నిండ్ర, విజయపురం మండలాలు

పలమనేరు డివిజన్ – 97044 95165
పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలు

వినియోగదారుడా మేలుకో..

- ప్యాకేజీలపై ముద్రించిన బరువు కచ్చితంగా ఉందో లేదో ఎలక్ట్రానిక్ కాటాలో సరిచూసుకోవాలి.
- తూనిక రాయి అడుగు భాగాన ముద్రిత సంవత్సరం, విభాగం, ఇన్‌స్పెక్టర్ సంఖ్య ఉన్నాయో? లేదో చూడాలి. పాత్రలకు సొట్టలున్నాయేమో? గమనించాలి.
- ఎలక్ట్రానిక్ కాటాపై ప్రామాణిక తూకం రాళ్లు పెట్టి అది సరిగా పనిచేస్తుందో? లేదో చూడాలి. ఎలక్ట్రానిక్ కాటాపై ఉన్న ఏ బటన్ నొక్కినా తేడా కనిపించకూడదు.
- ప్యాకేజీ వస్తువులపై తయారీ తేదీ, నెల, సంవత్సరం.. తయారీదారు పూర్తి చిరునామా ఫోన్ నంబర్, ఈ–మెయిల్ చిరునామా ఉన్నాయో? లేవో చూసుకోవాలి.
- ప్యాకేజీలు ఆకర్షణీయంగా ఉన్నంత మాత్రాన నాణ్యమైన సరకులని భావించొద్దు. ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి మోసపోవద్దు. జంబో సైజు, ఎకానమీ సైజు వస్తువుల కొనుగోలులోనూ అప్రమత్తంగా ఉండాలి.

బంగారు కొనుగోలులో భద్రం



- ఆభరణాల్లో రాళ్లకు, బంగారానికి వేర్వేరుగా తూకం వేస్తున్నారో లేదో గమనించాలి. చెల్లించిన సొమ్ముకు సరిపడా తూకం గల బంగారు ఆభరణాలు అందుతున్నాయో? లేదో తూనిక యంత్రంపై సరిచూసుకోవాలి.
- బంగారం నగల రశీదు (బిల్లు)లో స్వచ్ఛత (క్యారటేజ్) తెలియజేశారో లేదో గమనించండి.
- రశీదులో స్వచ్ఛతకు అనుగుణంగా బంగారం గ్రాము ధర ఉందో లేదో చూడండి.
- బంగారు నగలు కొన్నప్పుడు ఒక మిల్లీ గ్రాము వరకు కచ్చితత్వం గల ఎలక్ట్రానిక్ తూనిక యంత్రం వాడుతున్నారో? లేదో గమనించాలి.
- బంగారు నగలు తూకం వేసే ఎలక్ట్రానిక్ కాటాపై తూనికలు కొలతల శాఖ సీలు ఉందో? లేదో చూడాలి.

హక్కులు తెలుసుకోవాలి



“ వినియోగదారులు మరింత చెతన్యవంతులు కావాల్సి ఉంది. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. మోసాలు జరిగినట్లు గుర్తిస్తే ప్రశ్నించడానికి ఈ బిల్లులే ఆధారం అవుతాయి. ఎవరైనా మోసాపోయాం అని అధికారుల ఫిర్యాదు చేసినా వారికి అండగా ఉంటాం. బాధితులకు న్యాయం జరిగేంత వరకు సహకారం అందిస్తాం. వినియోగదారులు కచ్చితంగా హక్కులపై అవగాహన కలిగి ఉండాలి.

– శేషాద్రి జిల్లా వినియోగదారులసంఘ అధ్యక్షుడు, చిత్తూరు

1967కు కాల్ చేయండి



వస్తువుల కోనుగోలులో సమస్యలుంటే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి. తూకం, కొలతల్లో తూనికల కొలతలశాఖ ముద్ర ఉండాలి. ఏ వస్తువు అయిన ఎమ్మార్పీ కంటే ఎక్కవ ధరకు విక్రయించకూడదు. జిల్లాలో గత 11 నెలల్లో డీసీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పలు దుకాణల్లో తనిఖీలు చేసి 721 కేసులు నమోదు చేసి రూ.80 లక్షల వరకు జరిమానా విధించాం. వినియోగదారులకు ఎటువంటి సమస్య ఉన్న టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చు. మాకు వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

– స్వామి, సహాయకమిషనర్, తూనికల కొలతలశాఖ

'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేయండి



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సుమత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దినోత్సవం గా ప్రకటించిందన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ప్రతి నెలా ఒక ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పునర్వినియోగ వస్తువుల ప్రోత్సాహం (ఎస్‌ఏఎస్‌ఏ) ప్రధాన అంశంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పట్టణాలు, గ్రామాలు, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ తదితర కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. నిత్య జీవితంలో స్వచ్ఛత భాగం కావాలన్నారు. స్వచ్ఛత ప్రాముఖ్యతను తెలిపేలా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పునర్వినియోగ వస్తువుల ప్రోత్సాహంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శాఖలో కార్యక్రమాలు నిర్వహించి, వివరాలను స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రయాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.



పోటెత్తిన భక్తజనం

కాణిపాకం: వరసిద్ధివినాయకస్వామివారి ఆలయంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు. హోలీ సందర్భంగా సెలవు కావడంతో వరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వేకువజాము నుంచే క్యూకట్టారు. దీంతో ఆలయంలో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రసాద వితరణ చేశారు.

వినియోగించుకుంటే వజ్రాయుధమే

వస్తు రూపంలోనో.. సేవల రూపంలోనో మనిషి మోసపోతూనే ఉంటాడు. ఇలాంటి పరిస్థితిలో వినియోగదారుడికి అండగా నిలుస్తుంది వినియోగదారుల ఫోరమ్. ఈ ఫోరం మెట్లు ఒక్కసారి ఎక్కితే కొనుగోలుదారుడికి తప్పక న్యాయం జరుగుతుంది. దీన్ని వినియోగించుకుంటే వజ్రాయుధంగా పనిచేస్తుంది.

- అవగాహనే తొలి అస్త్రం.. ఆపై చట్టం
- మోసపోయిన వాళ్లకు అండగా కమిషన్
- ఆశ్రయిస్తే ఉచిత న్యాయసేవ.. పరిహారం
- నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

చిత్తూరు అర్బన్: కొన్న వస్తువు నాణ్యత లేకపోయినా.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి రూ.వేలల్లో బిల్లు చెల్లిస్తే సరిగా పట్టించుకోకపోయినా.. హోటల్‌లో రూ.40 వెచ్చించి తిన్న ఇడ్లీ బాగలేపోయినా.. ఓ సామాన్యుడి కడుపు మండిపోతుంది. ఎందుకంటే రూపాయి సంపాదించడానికి అతడు పడే కష్టం అలాంటిది. అలాంటి సామాన్యుడికి రక్షణ కల్పించడానికి అండగా నిలుస్తుంది వినియోగదారుల కమిషన్. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కమిషన్ పనితీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కమిషన్ పనితీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

తప్పనిసరి న్యాయం

వాస్తవానికి లోపరహిత వస్తుసేవలు పొందడం అందరి హక్కు. చాలా సంస్థలు నైతికతకు నీళ్లొదిలి నాసిరకం వస్తువులు, సరకులు, సేవలను అంటగడుతున్నాయి. తద్వారా వినియోగదారుల ప్రయోజనాలను అవి తుంగలో తొక్కుతున్నాయి. ఈ క్రమంలో ఒక వ్యక్తి కొన్న వస్తువు సరిగ్గా పనిచేయకపోయినా, పొందిన సేవలో లోపం ఉన్నా ఆ వ్యక్తి వినియోగదారుల కమిషన్ మెట్లెక్కవచ్చు. ఒక్కసారి కమిషన్‌లో తనకు జరిగిన మోసంపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా న్యాయం జరుగుతుంది. వినియోగదారుడిని రక్షించడంతో పాటు మోసపోయిన వారికి న్యాయం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటయ్యిందే 'జిల్లా వినియోగదారుల కమిషన్'. వినియోగదారుల కమిషన్ ఎలా పనిచేస్తుందంటే..!



చిత్తూరు కోర్టులో ఉన్న వినియోగదారుల కమిషన్ కార్యాలయం

చట్టంలో ఇలా..!

1986లో భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణ కోసం ఓ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. అదే వినియోగదారుల పరిరక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలుచేయడానికి 'రీడ్రసల్ ఫోరమ్స్'ను ఏర్పాటు చేశారు. మోసపోయిన వ్యక్తికి సగటు న్యాయం తప్పనిసరిగా సకాలంలో అందించాలన్నదే ఈ చట్టం లక్ష్యం. ఆర్టీసీ, రైల్వే, తపాలాశాఖ, బీఎస్‌ఎన్‌ఎల్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలతో పాటు డబ్బులు కట్టించుకుని సేవలు అందించే రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు ఎవరు మోసం చేసినా కమిషన్ తలుపుకొట్టి న్యాయం పొందొచ్చు. జిల్లా స్థాయిలో వినియోగదారుల ఫోరంగా ఉన్న బెంచ్‌ను 2020 జూ లైలో వినియోగదారుల కమిషన్‌గా మార్చారు. కమిషన్‌లో వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదు లను పరిష్కరించడానికి ఓ అధ్యక్షులతోపాటు ఇద్దరు సభ్యులుగా ఉంటారు. మనం నిత్యం న్యాయస్థానాల్లో జరిగే వాదనలు, ప్రతివాదనలు లాగే ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత కమిషన్ తీర్పును వెలువరుస్తుంది.

ఎవరు వినియోగదారులు..?

వినియోగదారుల హక్కుల చట్టం 1986 ప్రకారం తమ అవసరాల కోసం వస్తువులు కొనేవాళ్లు, సేవలు పొందే ప్రతీ ఒక్కరూ వినియోగదారుడే. కొనుగోలుదారుల అనుమతితో ఏదైనా వస్తువును, సేవలను ఉపయోగించుకునే వాళ్లు కూడా వినియోగదారులే. అంటే సమాజంలోని ప్రతీ ఒక్క వ్యక్తి ఏదో ఒకరూపంలో వినియోగదారులే అవుతారు.

తెల్ల కాగితంపై ఫిర్యాదు..

మనకు జరిగిన అన్యాయంపై కమిషన్ ఎదుట మన తరపు వాదనను మనమే స్వీయంగా వినిపించుకోవచ్చు. న్యాయవాది అవసరం తప్పనిసరికాదు. కమిషన్‌లో ఫిర్యాదు చేసే ముందు సేవాలోపం, కొన్న వస్తువుకు సంబంధించిన బిల్లు తప్పనిసరి. ఓ తెల్లకాగితంలో తాను మోసపోయిన విధానాన్ని రాసి, సంతకం చేసి కమిషన్‌కు ఇస్తే.. ప్రతివాదికి నోటీసులు పంపిస్తారు. 90 రోజుల్లో మన కేసును పరిష్కరించాలని చట్టంలోనే రూపొందించారు. జిల్లా స్థాయిలో ఇచ్చిన తీర్పుపై సంతృప్తి చెందకుంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలోని కమిషన్‌ను ఆశ్రయించే వెలుసుబాటు ఉంది. చిత్తూరులోని వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో ఫోన్–08572235577 నెంబరుకు సంప్రదించి ఫిర్యాదులపై సహాయం తీసుకోవచ్చు.

గెలిచిన ధీరులు

- చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లెకు చెందిన శ్రీదేవి అనే గృహిణి ఓ రిఫ్రిజిరేటర్‌ను రూ.11 వేలు వెచ్చించి కొన్నారు. ఆర్నెళ్ల తరువాత ఫ్రిడ్జి తలుపు తుప్పు పట్టడం ప్రారంభించింది. దుకాణ యజమానికి చెబితే పట్టించుకోలేదు. తీరా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తే తగిన బిల్లులు, ఫ్రిడ్జి చూసిన కమిషన్ ఆ మహిళకు కొత్త రిఫ్రిజిరేటర్ ఇవ్వడంతో పాటు కోర్టు ఖర్చులకు రూ.3 వేలు, ఆమె పడిన మానసిక వేదనకు రూ. 10 వేలు పరిహారం ఇవ్వాలని కమిషన్ ఆదేశించింది.
- పశువుల కొనుగోలు సమయంలో బీమా చేస్తే, అవి మృత్యువాత పడితే పరిహారం ఇవ్వలేదని పలమనేరుకు చెందిన వెంకటముని అనే వ్యక్తి కమిషన్‌లో కేసు వేశారు. మృతి చెందిన రెండు ఆవులకు రూ.1.20 లక్షల బీమా, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు, వెంకటముని పడిన బాధకు రూ.5 వేలు పరిహారం ఇవ్వా లని కమిషన్ ఇచ్చిన తీర్పు బీమా కంపెనీల్లో బాధ్యతను పెంచినట్లయ్యింది.
- నాసిరకం హెల్మెట్ విక్రయించినందుకు రూ.10 వేల పరిహారం ఇవ్వాలనే కమిషన్ తీర్పును అమలుచేయనందుకు కుప్పం పట్టణానికి చెందిన శివయ్య మళ్లీ కమిషన్ తలుపు తట్టాడు. తీర్పు అమలు చేయని చిత్తూరులోని డీలర్‌కు, బెంగళూరులోని కంపెనీదారుడి అరెస్టు వారెంటు జారీ చే యడంతో వినియోగదారుడి పరిహారం ఇచ్చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలువురు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు రాష్ట్ర మైనారిటీ విభాగం జోనల్‌ అధ్యక్షుడిగా షఫీ అహ్మద్‌ ఖాద్రీ, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శులుగా ఎస్‌డీ అబ్బాస్‌, మహీన్‌, మహ్మద్‌ మగ్దూం మొహిద్దీన్‌, రాష్ట్ర మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శులుగా షేక్‌ సర్దార్‌, నూర్‌, రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొప్పాల భాస్కర్‌ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శిగా యుగంధర్‌ రెడ్డి నియమితులయ్యారు.

పలమనేరు బాలాజీకి కెనడా తెలుగుతల్లి పురస్కారం



పలమనేరు: కెనడాలోని తెలుగుతల్లి పత్రిక ఏటా అందించే గుర్రాల లక్ష్మీ ప్రసాద్‌ స్మారక పురస్కారానికి పలమనేరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, నవలాకారుడు పలమనేరు బాలాజీ ఎంపికయ్యారు. ఆ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఈ వివరాలను మెయిల్‌ ద్వారా పంపారు. తెలుగు సాహిత్యంలోనే తొలిసారిగా ఎరుకుల కులస్తుల కష్టాలను కంటికి కనిపించేలా చిత్రీకరించిన 'ఏకలవ్య కాలనీ' అనే కథను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇలా ఉండగా పలమనేరు బాలాజీ మూడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలను పొందారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

ప్రియునిపై ప్రియురాలు ఫిర్యాదు

విజయపురం: పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని ప్రియుడు మోసం చేసిన సంఘటన విజయపురం మండలం కళియంబాకంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు..నింద్ర గ్రామానికి చెందిన యువతి తన తండ్రి మరణించడంతో సుమారు ఎనిమిదేళ్ల కిందట విజయపురం మండలం కళియంబాకంలో నానమ్మ పంచన చేరింది. అక్కడి పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో జ్యోతిబసు అనే యువకునితో పరిచయం ఏర్పడింది. మూడేళ్లపాటు సాగిన ఆ పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఆమె సర్వస్వం అతనికి అర్పించింది. అయితే ఈమెతో ప్రేమాయణం కొనసాగిస్తూ మరో యువతిని కూడా ప్రేమిస్తూ ఆమెను కూడా పెళ్లి చేసుకుంటానని చెప్పిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఈ విషయమై జ్యోతిబసును ఆ యువతి నిలదీయగా పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకునేందుకు ఏడు నెలల క్రితం అంగీకరించాడు. అయితే ఏడు నెలలు దాటినా వివాహం చేసుకుండా జాప్యం చేస్తూ రావడంతో అతన్ని నిలదీయగా తనకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది.. ఇక నీతో తనకు అవసరం లేదు.. కట్నం ఎక్కువగా ఇచ్చే అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు ఏం చేయాలో తెలియక పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు జ్యోతిబసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బలరాం తెలిపారు.

పచ్చ 'ప్రళయం'



- డ్రైవర్స్‌కాలనీలో టీడీపీ గూండాగిరి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం







కర్ర చేతపట్టుకుని దాడికి పాల్పడుతున్న శివ, కూటమి నాయకులు ధ్వంసం చేసిన బైక్‌, దాడికి పాల్పడిన శివ చేతిలో ఉన్న పెద్ద కర్ర

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: డ్రైవర్స్‌కాలనీలో పచ్చప్రళయం కొనసాగుతోంది. ప్రభుత్వ అండదండలు చూసుకుని కాలనీ ఇక తమకు అడ్డెవరంటూ రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, తమను వ్యతిరేకించిన ప్రజలపై దాడులు చేయాలని రవి సిఫార్సు చేసి పరోక్షంగా వెనకుండి కథ నడిపిస్తే.. శివ ప్రత్యక్షంగా సీన్‌లోకి దిగి దాడులకు తెగబడతాడు. వీరి గూండాగిరీకి భయపడి గతంలో కాలనీ విడిచి వెళ్లిపోయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబు, అతని భార్య వార్డు సభ్యురాలు విజయ, కొడుకు దిలీప్‌ చాన్నాళ్లకు మళ్లీ తమ స్వగ్రామానికి రావడమే ఆలస్యం. గురువారం రాత్రి కాలనీలో వారిని గుర్తించిన పచ్చమూకలు శివ, రవి, కిరణ్‌, మధు, ప్రకాశ్‌, కళ్యాణ్‌ కలిసి కర్రలు, వేట కొడవళ్లతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. మహిళ అని కూడా చూడకుండా ఆమె దుస్తులు చింపి క్రూరంగా ప్రవర్తించి, తన చేయి విరిచారంటూ ఆమె ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బాధితులను చరవాణి ద్వారా పరామర్శించారు. వైఎస్సార్‌ సీపీ మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాద, చంద్రప్ప, గిరిరాజారెడ్డి, శ్రీనివాసులు, మహేష్‌, రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు.

ప్రభుత్వం, పోలీసుల అండతోనే రెచ్చిపోతున్నారా?

గతంలో ఇలాగే కాలనీ వాసులను నయవంచనకు గురి చేసి పేదల ఇళ్ల స్థలాలను కాజేసి, అడిగిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడి ఆడ, మగ తేడా లేకుండా విచక్షణారహితంగా దాడి చేశారు. ఇంత జరిగినా అప్పట్లో వీరిపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు. వారు ఎంతటి గూండాయిజానికి పాల్పడినా ప్రభుత్వంతో పాటు పోలీసుల అండదండలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వారి అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని బాధితులు ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై రౌడీయిజం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు వాపోయారు. ఏదైనా జరిగితే ఆ ఘటనపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, తమపై దాడి చేసిన రౌడీలంతా కాలనీలోనే ఉన్నా నిందితులను పోలీసులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కూటమి అండతో అరాచకాలకు ఆజ్యం

నిజమైన కూటమి నాయకులు, కార్యకర్తలు ఏదో తమ పనులు తాము చేసుకుంటూ పోతుంటే డ్రైవర్స్‌ కాలనీలో మాత్రం టీడీపీ తమ్ముళ్లు అరాచకాలకు ఆజ్యం పోస్తున్నారు. కాలనీలో అరాచకాలు సృష్టించడమే వారి జీవన విధానంలా మార్చుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే కాలనీలో ఉన్న పేదల ఇళ్ల స్థలాలను కాజేయడం, ప్రశ్నించిన ప్రజలపై దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురి చేసి, కాలనీ నుంచి తరిమికొట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి శివ, రవి ఇద్దరిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినా వారిలో చలనం రాలేదు. కాలనీలో మరింత ఎక్కువగా పచ్చమూకల అరాచకాలు అధికమయ్యాయి. ఇకనైనా పచ్చమూకల అరాచకాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పచ్చమూకల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు



వెన్నెముక విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్‌



వార్డు సభ్యురాలు విజయ

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబంపై టీడీపీ నేతల దాడి

– ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబంపై తెలుగు తమ్ముళ్ల పైశాచిక దాడికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గంగవరం డ్రైవర్స్‌ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబు, ఆయన కుటుంబ సభ్యులపై అదే కాలనీకి చెందిన కూటమి నాయకులు రవి, శివ మరికొంతమంది కలిసి దాడికి పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే టీడీపీ నేతల దాడులకు భయపడి బాబు కుటుంబంతో సహా కాలనీ విడిచి వెళ్లిపోయారు. కొన్ని నెలల తరువాత మళ్లీ గురువారం స్వగ్రామానికి రాగానే కూటమి నాయకులు రాత్రి వేళ తమపై కర్రలు, కొడవళ్లతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచినట్టు బాధితులు ఆరోపించారు. తమ బైక్‌ను కూడా ధ్వంసం చేసినట్టు మండిపడ్డారు. కాలనీ వాసులంతా ఏకమై ఘర్షణను ఆపాలని చూసినా సాధ్యం కాలేదని తెలిపారు. ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకుని గాయాలతో ఆస్పత్రిలో చేరినట్టు తెలిపారు.

గణేశా అని సంబోధించాలి : ఈఓ

కాణిపాకం: ఆలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్‌, సెట్‌లో ఆరంభం గణేశా అని సంబోధించాలని ఈఓ పెంచల కిషోర్‌ ఆదేశించారు. కాణిపాకంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆలయ పండితులు, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు ధీధరించకుండా ఓపికతో సమాధానం చెప్పాలన్నారు. సెల్‌ఫోన్‌, సెట్‌, ఇతర సందర్భాల్లో గణేశా అని సంబోధించాలన్నారు. కౌంటర్‌లో పనిచేసే సిబ్బంది టిక్కెట్ల జారీలో అలసత్వం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ క్రిష్ణారెడ్డి, ధనంజయ్య, హరిమాధవరెడ్డి, ప్రసాద్‌ ఉన్నారు.

జనసేన పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడిపై ఎస్సీ,ఎస్టీ కేసు

గుడిపాల: జనసేన పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడు రూప్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..కొత్తకోట ఆదిఆంధ్రవాడకు చెందిన సంధ్య(28) అనే మహిళ కొత్తకోట గ్రామానికి చెందిన ధనలక్ష్మి వద్ద రెండేళ్ల కిందట రూ.50 వేలు అప్పుగా వడ్డీకి తీసుకున్నారు. ఈ డబ్బును రూప్‌కుమార్‌ దగ్గరుండి సంధ్యకు తీసిచ్చారు. ఈ నేపథ్యంలో రూ.30 వేలతో పాటు వడ్డీని కట్టేశారు. మిగిలిన రూ.20 వేలుకు ఒకనెల సమయం తీసుకున్నారు. అనారోగ్యం కారణంగా ముందుగా చెప్పిన సమయానికి రూ.20 వేలు చెల్లించలేదు. దీంతో రూప్‌కుమార్‌ రాత్రి సమయంలో ఇంటికి వచ్చి, సంధ్య, అతని భర్త జగదీష్‌ నిద్రిస్తుండగా నిద్రలేపి కులం పేరుతో, అసభ్య పదజాలంతో దూషించాడు. దీనిపై సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూప్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూసానా...మజాకానా

- కూటమి నేత అక్రమ రేషన్‌ వ్యాపారం గుట్టురట్టు
- తిమ్మసముద్రం కోడిగుట్టలో తాళం పగలగొట్టి రూ.1.24 లక్షలు విలువ చేసే 5టన్నుల బియ్యం స్వాధీనం
- అక్రమ వ్యాపారి టీడీపీ నేత మూసపై 6ఏ కేసు నమోదు



పట్టుబడిన రేషన్‌ బియ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: కూటమి నేత అక్రమ రేషన్‌ వ్యాపారం గుట్టు రట్టు అయ్యింది. అక్రమ నిల్వలు బట్టబయలయ్యాయి. రూ.1.24 లక్షలు విలువ చేసే 5 టన్నుల బియ్యం నిల్వలను రెవెన్యూ అధికారులు, పోలీసులు తాళం పగలగొట్టి పట్టుకున్నారు. బియ్యం అక్రమ వ్యాపారిగా పేరుమోసిన కూటమి నేత మూసాపై శుక్రవారం 6ఏ కేసు నమోదు చేశారు. ఆ తర్వాత తీగా కదిలిస్తే డొంకా కదిలింది. రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నట్లు అధికార వర్గాలు గుర్తించాయి.

పట్టుబడింది ఇలా...

చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలోని తిమ్మసముద్రం కోడిగుట్టలో మూసా అనే కూటమినేత భారీగా రేషన్‌ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు గురువారం రాత్రి రంగంలోకి దిగిన పోలీసులు, రెవెన్యూ అధికారులకు మూసా కనిపించకుండా పోయాడు. పలుమార్లు ఫోన్‌ చేసిన స్పందించకపోవడంతో అక్రమ నిల్వ ఉన్న ఇంటి తాళం పగలగొట్టారు. దీంతో భారీగా అక్రమ బియ్యం నిల్వలు బయటపడ్డాయి. 5 టన్నుల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.24 లక్షలుగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో ఆర్‌ఐ దినేష్‌ సమక్షంలో పంచనామా రాశారు. 6ఏ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పలు విషయాలు బయటపడ్డాయి.

దందా ఇలా..

మూసాకు అక్రమ రేషన్‌ వ్యాపారం మజాగా మారింది. కొంతమంది డీలర్లను చేతిలో వేసుకుని అక్రమ దందాకు ఆజ్యం పోస్తున్నాడు. డీలర్ల ద్వారా బల్క్‌గా రేషన్‌ బియ్యం సేకరించి, అక్రమ బియ్యం వ్యాపారం దర్జాగా చేసుకుంటున్నాడు. అలాగే కొంత మంది అక్రమ వ్యాపారులతో చేతులు కలిపి అక్రమ బియ్యం దందాకు తెరలేపుతున్నాడు. ఇలా భారీగా రేషన్‌ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసుకుని సన్నబియ్యంగా మార్చేస్తున్నాడు. బ్రాండ్‌ పేరుతో మార్కెట్లో అమ్మకానికి పెడుతున్నారు. అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని సరిహద్దులు దాటిస్తున్నాడు. సన్నబియ్యంగా మార్చిన బియ్యాన్ని లారీల్లో నింపి అధికంగా కర్ణాటకకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఒకసారిగా రూ. 5 లక్షలకుపైగా విలువ చేసే సరుకు హద్దులు దాటి వెళుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం ఆనోటా..ఈ నోటా పడి అలా అధికారుల చెవిలో పడడంతో అక్రమ బియ్యం గుట్టు రట్టు అయ్యింది. రెడ్‌ హ్యాండెడ్‌గా చేతికి చిక్కింది. మూసాపై కేసు నమోదు చేశారు. కానీ అతని అక్రమ వ్యాపారంలో భాగమైన మరో ఇద్దరిపై కేసు నమోదు చేస్తారా? లేదా..అనేది ప్రశ్నార్థకంగా మారింది. భారీ స్థాయిలో రేషన్‌ బియ్యం పట్టుబడితే కేవలం ఆ ఒక్క వ్యక్తిపై కేసు నమోదు చేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. టీడీపీ కనుసన్నల్లో జరుగుతున్న అక్రమవ్యాపారాలు బట్టబయలవుతున్నా అధికారులు చోద్యం చూడడంపై అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు అక్రమ వ్యాపారుల మామూళ్ల మత్తుల్లో జోగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇది నిజమే..?

రెండు రోజుల నుంచి అధికారులకు అక్రమ రేషన్‌ బియ్యం నిల్వలపై ఫిర్యాదులు జోరందుకున్నాయి. అధికారులు తాళం పగలగొట్టక ముందు 10 టన్నులకు పైగా బియ్యం ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ ఒత్తిడితో 5 టన్నులకు పైగా బియ్యాన్ని మళ్లించారని తెలుస్తోంది. ఆ తర్వాతే తాళం పగలకొట్టి మిలిగిన 5 టన్నుల బియ్యాన్ని పట్టుకున్నట్లు చూపించారనే ఆరోపణలు వస్తున్నాయి.

బాస్కెట్‌బాల్‌ క్రీడాభివృద్ధికి పకడ్బందీ చర్యలు



జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్‌ పోటీలకు ఎంపికైన చిత్తూరు జిల్లా జట్టు

- బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లాలో బాస్కెట్‌బాల్‌ క్రీడాభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెసానికల్‌ మైదానంలో అండర్‌ 23 రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన రాష్ట్ర స్థాయి జట్లు ఈ నెల 18 నుంచి 24 వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. జాతీయ స్థాయి పోటీలు అసోం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయి జట్లల్లో మంచి ప్రతిభ చాటిన 25 మంది పురుషులు, 25 మంది మహిళలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జట్లకు ఈ నెల 6 నుంచి 14 వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని మెసానికల్‌ మైదానంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణలో ప్రత్యేక ప్రతిభ చాటిన 12 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభను చాటాలన్నారు. చిత్తూరు ట్రాఫిక్‌ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షులు ఎన్‌పీ జయప్రకాష్‌, కార్యదర్శి సురేష్‌బాబు, కోచ్‌లు నాగరాజు, రుద్ర, బాబు, జాను, రాజేశ్వరి, డీఎస్‌డీవో బాలాజి, పీడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 51,148 మంది స్వామివారిని దర్శించుకోగా 21,236 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం




ఖిరసే యాదవ్‌(ఫైల్‌)

పెద్దపంజాణి: మండలంలోని చీకలదిన్నేపల్లి సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పెద్దపంజాణి పోలీసుల కథనం మేరకు.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన సంతూ యాదవ్‌ కుమారుడు ఖిరసే యాదవ్‌ (25) ఆరు నెలల నుంచి చీకలదిన్నేపల్లి సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్ల ఫారంలోని ఫ్యాన్‌ను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కోమాలోకి వెళ్లాడు. వెంటనే ప్రమాదాన్ని గుర్తించిన ఇతర కూలీలు 108 వాహనంలో అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కోళ్లఫారం మేనేజర్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పుంగనూరు: పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ చెందిన అబ్దుల్‌వాహబ్‌ కుమారుడు సయ్యద్‌(22) అనారోగ్యంతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సయ్యద్‌ ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే మృతి చెందడంతో పోలీసులు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో జర్మనీ భాష అభ్యసన కేంద్రం!



వీసీతో సమావేశమైన స్టడీ వింగ్స్‌ ప్రతినిధులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్‌ కళాశాల 'స్టడీ వింగ్స్‌ ఓవర్సీస్‌ సంస్థ' సహకారంతో జర్మనీ భాష అభ్యసన కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి కార్యాలయంలో స్టడీ వింగ్స్‌ సంస్థ ప్రతినిధులు శుక్రవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్‌ భూపతి నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. జర్మనీలో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీని కోసం వర్సిటీ నందు 'స్టడీ వింగ్స్‌ టు ఓవర్సీస్‌' సంస్థ సహకారంతో జర్మనీ అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశం అనంతరం సంస్థ ప్రతినిధులు ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్టడీ వింగ్స్‌ సంస్థ ప్రతినిధులు నరేంద్ర రెడ్డి, వల్లేరు సుకన్య, అధ్యాపకులు, ఇంజినీరింగ్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చిత్తూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గంగవరం మండలంలో కారు బైక్‌ను ఢీకొని ఒకరు, పాలసముద్రం మండలంలో రెండు బైక్‌లు ఢీకొని మరొకరు దుర్మరణం చెందారు.

బైక్‌ను ఢీకొన్న కారు..ఒకరి మృతి

గంగవరం: ముందు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గంగవరం మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆలకుప్పం గ్రామానికి చెందిన నరేష్‌(28), విజయ్‌(24) బైక్‌లో పలమనేరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిలో గోవిందశెట్టిపల్లి గ్రామం వద్ద బెంగళూరు వెళుతున్న కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో వెనుక కూర్చున్న నరేష్‌ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందగా బైక్‌ నడుపుతున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్‌ చేసి, స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నరేష్‌ మృతదేహం



మణి మృతదేహం

రెండు ద్విచక్రవాహనాల ఢీ.. మరొకరు..

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం దళితవాడ మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఢీకొనడంతో తమిళనాడువాసి మణి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ఈడిగపల్లెకు చెందిన మణి(55) సొంతపని పాలసముద్రం గ్రామానికి వచ్చాడు. అనంతరం స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యాడు. పాలసముద్రం దళితవాడ నుంచి గుండుబావి వద్ద హోటల్‌లో భోజనం పార్శిల్‌ తీసుకువెళ్లడానికి విజయ్‌కుమార్‌ అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో ఎదురుగా వస్తుండగా మార్గం మధ్యలోని మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఈడిగపల్లెకు చెందిన మణి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను 108లో ఆస్పత్రికి తరలించారు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని, పరిశీలించారు. మణి కుమారుడు ఉదయ్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డిప్ప తెలిపారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



గుడిపాల: అరటి పంటను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

– పంట పొలాలు ధ్వంసం

గుడిపాల: ఒంటరి ఏనుగు హల్‌చల్‌ చేసింది. పంట పొలాలను ధ్వంసం చేసింది. వెప్పాలమానుచేను, పిళ్లారికుప్పం, అడవిచేను గ్రామాల్లోని పలు రైతులకు సంబంధించిన వరి , అరటి, కొబ్బరి తోటలను నాశనం చేసింది. పిళ్లారికుప్పంలో కొబ్బరి చెట్ల అడుగు భాగం మొత్తాన్ని తినేసింది. గుడిపాల మండలంలోని పిళ్లారికుప్పం, పాపసముద్రం, అడవిచేను, బండపల్లె, చిత్తపార ప్రాంతాల్లో వరి పంటను రైతులు అత్యధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఏనుగు ఆ ప్రాంతం వైపే ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

పొలాల వద్దకు రాత్రి వేళల్లో వెళ్లవద్దు

రైతులు రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఏ సమయంలో ఏ ప్రాంతంలోకి ఒంటరి ఏనుగు సంచరిస్తుందో తెలియడం లేదని రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాడి పశువులను కొంత మంది రైతులు పొలాల వద్ద కట్టేస్తున్నారని వాటిని ఇంటి వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందజేస్తామని డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ ఆనందరెడ్డి తెలిపారు.

రైస్‌ మిల్లులో చోరీ

పుత్తూరు: పట్టణంలోని నెత్తం గ్రామం వద్ద ఉన్న రైస్‌ మిల్లులో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో చోరీ జరిగింది. దుండగులు మిల్లు తలుపుల తాళాలు పగలగొట్టి, ఏసీ, ఇన్వర్టర్‌ను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు గుర్తించి కేకలు పెట్టడంతో దుండగులు పారిపోయారు. విషయం తెలుసుకుని మిల్లు వద్దకు వచ్చిన యజమాని బాలసుబ్రమణ్యం మిల్లులో అమర్చిన సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్‌ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు.



దుండగులు వదలి వెళ్లిన ఏసీ ఇన్వర్టర్‌